క్లుప్తంగా

వేల్పూరు సబ్ స్టేషను త్వరలో ప్రారంభోత్సవం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపంలో నెలకొల్పిన విద్యుత్ ఉప కేంద్రాన్ని నరసరావుపేట డీఈఈ సి.హెచ్. రాంబొట్ల శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో నిలిచిపోయిన పనులన్నీ పూర్తి చేసి వారం రోజుల వ్యవధిలో ప్రారంభోత్సవం అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు గాను క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులు పరిశీలించామన్నారు. ఆయనతో పాటు ఏఈ జవ్వాజీ నటరాజ్ తదితరులు ఉన్నారు.

కాల్వల్లో పూడికతీత పనులకు శ్రీకారం

శావల్యాపురం: మండల కేంద్రంలో రూ. 2 లక్షల పంచాయతీ నిధులతో మురుగుకాల్వల్లో పూడికతీత పనులు చేపట్టినట్లు కార్యదర్శి బోడ్డు యాకోబు శుక్రవారం తెలిపారు. గ్రామంలో అన్నీ వీధుల్లో ఉన్న మురుగు కాల్వలన్నీ పూర్తిస్థాయిలో పూడికతీత పనులు చేపట్టి అనంతరం కాల్వలో పూడిక వచ్చిన మట్టిని ట్రాక్టరు ద్వారా తొలిగిస్తామన్నారు. అలాగే స్వచ్ఛ సంపద కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువు తయారు అవుతుందన్నారు. పరిసరాలు పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పంచాయతీకు అదనపు ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఏసురాజు, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: పట్టణంలో మంచినీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ప్రతిరోజూ సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకానికి సంబంధించి ఇంటర్ కనెక్షన్ పనులు, పైపు లైన్ల లీకేజీ మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుకున్న సమయానికి సక్రమంగా పనులు పూర్తి అయితేనే ఈ వేసవి నుంచి పట్టణ ప్రజలకు రోజు వారి మంచినీటి సరఫరా చేయడం సాధ్యమౌతుందన్నారు. ఏఏ వార్డుల్లో నీటి ఎద్దడి ఉందో గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ షేక్ అబ్దుల్ రహీం, ఏఈఈ చల్లా శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశం దృష్టికి సమస్యలు

వినుకొండ: పట్టణంలోని పురపాలక సంఘంలో మున్సిపల్ సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అజెండాలో పొందుపరిచిన 71 అంశాలకు గాను ఐదు అంశాలు రద్దు చేయగా మిగిలిన అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వార్డులలో కుక్కలు, కోతుల బెడదలు ఎక్కువయ్యాయని, మున్సిపల్ కార్మికులు అవసరం ఉన్న చోట కాకుండా అవసరం లేని చోట కుక్కలను పడుతున్నారని కౌన్సిలర్లు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పట్టణంలోని ప్రధాన వీధులలో ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారిందని, షాపుల యజమానులు రోడ్లు ఆక్రమించి మరీ వ్యాపారాలు చేస్తున్నారని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ట్రాఫిక్ సమస్యపై ప్రతి వారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా 32వార్డుల అభివృద్ధికి సహకరిస్తానన్నారు.

సత్తాచాటిన విద్యావికాస్ హైస్కూల్ విద్యార్థి



వినుకొండ: రాష్ట్రస్థాయి హ్యాండ్ రైటింగ్ పోటీల్లో పట్టణంలోని విద్యావికాస్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బత్తుల రాజశ్రీ ప్రతిభ కనపరిచినట్లు చేతిరాత నిపుణుడు ఎస్.వి.సీతారామయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమీ వారు జనవరి 25న నేషనల్ హ్యాండ్ రైటింగ్ డే సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా నిర్వహించిన పోటీల్లో రాజశ్రీ కర్సివ్ హ్యాండ్ రైటింగ్ విభాగంలో స్టేట్ 3వ ర్యాంక్ సాధించిందని, ఈ మేరకు తిరుపతిలో జరిగిన ఓ సమావేశంలో రాజశ్రీ తరపున తాను అవార్డు అందుకున్నట్లు తెలిపారు. రాజశ్రీని ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, అభినందించారు.

23న హేతువాద సభ

నరసరావుపేట: ప్రజలలో మూఢ నమ్మకాలను తొలగించి వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈనెల 23వ తేదీ ఆదివారం స్థానిక గుంటూరు బైపాస్‌రోడ్డులోని ఎస్ఎస్ఆర్ హోమ్స్‌లో పల్నాడు జిల్లా ద్వితీయ హేతువాద సభలు నిర్వహిస్తున్నట్లు గాంధీస్మారక సమితి అధ్యక్షులు ఈదరగోపీచంద్ వెల్లడించారు.

పేరంటాళ్లమ్మ తిరునాళ్లకు

200 ఏళ్ల చరిత్ర

- 30న బొందిలిపాలెంలో అమ్మవారి తిరునాళ్ల
- వారం రోజులు ముందుగా సందడి



మూలవిరాట్



అమ్మవారి దేవాలయం

శావల్యాపురం: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ అందరి చేత పూజలందుకుంటోంది మండలంలోని శానంపూడి బొందిలిపాలెంలోని శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారు. అమ్మను కొలిచినంతనే తమ కోర్కెలు ఇట్టే తీరుతాయని అందరి విశ్వాసం. ఆ జగన్మాతకు ప్రతిఏడాది తిరునాళ్లు నిర్వహిస్తారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఈనెల 30న ఈ తిరునాళ్ల వేడుక జరుగనుంది.

విశిష్టతను పరిశీలిస్తే..

200 సంవత్సరాల క్రితం పేరయ్య, పేరమ్మ దంపతులు ఆవులను తీసుకుని మేత కోసం అడవికి వెళ్లగా హఠాత్తుగా పులి పేరయ్యపై దాడి చేసి చంపేసింది. భర్త మరణాన్ని తట్టుకోలేని భార్య చితి మంటల్లో దూకి సతీసహగమనం చేసింది. తదుపరి ఇరువురు దంపతులు అడవిలో శిలరూపాల్లో వెలిశారు. శిలల రూపాల్లో వెలిసిన పేరయ్య, పేరమ్మలను పరిసర గ్రామాల ప్రజలు శ్రీ అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారిగా నామకరణం చేసి నాపరాళ్ళతో దేవాలయంగా ఏర్పాటు చేసి అప్పటి నుంచి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తుంది. కొన్ని సంవత్సరాలు అనంతరం బొందిలిపాలెం గ్రామానికి చెందిన పాపసాని పేంటయ్య మరొకరు అమ్మవారి దేవాలయం అభివృద్ధికి 5 ఎకరాలు పొలాన్ని విరాళంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఉగాది పర్వదినం ప్రతి ఏటా తిరునాళ్ల వేడుకలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రానురాను అమ్మవారి విశిష్టత నలుమూలలకు వ్యాపించటతో దేవాలయం అభివృద్ధికి గ్రామస్తులు సౌజన్యంతో దేవాలయం దేవదాయ శాఖ పరిధిలో చేరటంతో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో ప్రతిఏటా తిరునాళ్ల వేడుకలు ఘనంగా జరుపుతున్నారు. ఇరు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

వారం ముందుగా సందడి

తిరునాళ్లకు వారం రోజుల నుంచి భక్తులతో అమ్మవారి దేవాలయం సందడి నెలకొంటుంది. పశువులు, జీవాలు దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేయటంతో పాటు మహిళా భక్తులు పొంగళ్ల పొంగించి అమ్మవారికి ప్రసాదం రూపంలో తమ మొక్కులు తీర్చుకుంటారు. నియోజకవర్గ స్థాయిలో ప్రసిద్ధిగాంచిన ఈ అమ్మవారి తిరునాళ్ల వేడుకలకు రంగం సిద్ధం చేస్తున్నారు. తిరునాళ్ల వేడుకలకు వివిధ గ్రామాల నుంచి తడిక ప్రభలు, బోల్ట్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నారు.

అందరి సహకారంతో నిర్వహిస్తాం



అందరి సహకారంతో తిరునాళ్లను విజయవంతం చేస్తాం. వేడుకలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాం. అమ్మవారిని దర్శించుకునే భక్తులకు క్యూలైన్లు, తాగునీరు కూడా ఏర్పాటు చేస్తున్నాం. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశాం

–యం.సుధాకర్ రెడ్డి, ఈవో

ట్రాఫిక్ సమస్య రానివ్వం



తిరునాళ్ల వేడుకలు సందర్భంగా ట్రాఫిక్ సమస్య లేకుండా ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నాం. చరిత్ర కల్గిన తిరునాళ్లకు వాహనాలు రద్దీని ట్రాఫిక్ సమస్యను అధిగమించటానికి ప్రత్యేక చర్యలు చేపట్టాం. డ్రోన్ కెమెరాతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తిరునాళ్ల ఏర్పాట్లు పర్యవేక్షణ చేస్తున్నాం.

–లేళ్ళ లోకేశ్వరరావు, ఎస్ఐ

పీ4 సర్వేపై సమావేశం



వినుకొండ : పట్టణంలోని 1 వార్డు సచివాలయంలో పీ4 సర్వేపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం సమాజంలో ఉన్న 20 శాతం అత్యంత నిరుపేదల అభ్యున్నతికి పీ4ను ప్రారంభించిందన్నారు. మోడల్, ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం ద్వారా టాప్ 10 శాతం తెలుగు ప్రవాసులు, అధిక సంపన్నుల సహకారంతో పేదరికం లేని సమాజాన్ని సాధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీ4పై నేడు గ్రామసభలు

నాదెండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు-పబ్లిక్-పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ4) సర్వే గత కొద్దిరోజులుగా గ్రామాల్లో నిర్వహిస్తున్న విషయం విదితమే. దీనిపై మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శనివారం గ్రామ సభ నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బందితో ఇప్పటి వరకూ జరిగిన పీ4 సర్వేపై ప్రగతి నివేదిక అందించాలన్నారు.

భక్తి–మోక్ష సాధనకు మార్గాలు

నరక విముక్తి మార్గం- తాఖ్‌రాతుల మహోత్మ్యం

- రంజాన్ రోజా దీక్షల ముగింపు ఘట్టం
- ఇహపర సాధనకు ఇది ఉత్తమమైన సమయం!



శుక్రవారం ఇఫ్తార్ సమయంలో రోజా దీక్షధారులతో నిండిన మసీదు



చిలకలూరిపేట అమీమియా మసీదులో ఎతేకాఫ్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పరదా

యడ్లపాడు: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో చివరి పది రోజులు ఆధ్యాత్మికతకు, భక్తికి, మోక్ష మార్గానికి అతి ముఖ్యమైనవిగా భావిస్తారు. రెండో పదిరోజులు తమ పాపాలను క్షమించమని ప్రార్థిస్తారు. అయితే చివరి పది రోజులు మరో స్థాయిలో భక్తిభావాన్ని అలవరచుకోవడానికి ప్రత్యేకమైనవి. ముఖ్యంగా 21, 23, 25, 27, 29వ తేదీల్లో వచ్చే బేసి సంఖ్యల్లోని రాత్రుల్లో ఉంటుందని వీటిని తాఖ్‌రాత్‌లు (ప్రత్యేక జాగరణ దినాలు)గా ముస్లింలు విశ్వసిస్తారు. ఈ ఐదు రాత్రుల్లో ఒకరాత్రి పవిత్ర దివ్యఖురాన్ అల్లాహ్ నుంచి దైవ వాణి (వహి) ద్వారా భూమిపై ఉన్న మొహమ్మద్ ప్రవక్తకు చేరిందని అనేక హదీస్‌లు పేర్కొన్నాయి. ఆ రాత్రిని షబ్ ఏ ఖదర్ లేదా లైలాతుల్‌ఖద్ర్, బడీ రాత్‌గా పిలుస్తారు.

ఖురాన్ ప్రకారం ఈ ఒక్కరేయి చిత్తశుద్ధితో చేసే ఆరాధన వెయ్యి మాసాల కన్నా ఎక్కువగా చేసిన దైవారాధనతో సమానంగా పరిగణింపబడుతుంది. ఈ పవిత్ర తాఖ్ రాత్రుల్లో అన్ని మసీదులలో తరావీహ్ నమాజు అనంతరం సామూహిక ఇబాదత్ (ఆరాధన) నిర్వహించనున్నారు. ఖురాన్ పఠనం, సహస్ర నమాజులు, మౌలానాలు, ఆధ్యాత్మిక వక్తలు ఈ రాత్రుల్లో అల్లాహ్ సందేశాన్ని భక్తులకు అందజేస్తారు. ముస్లింలు కొత్తదుస్తులు ధరించి మసీదుల్లో నమాజులు, ఖురాన్‌పఠనం, బయాన్, దువాలతో జాగారం చేస్తారు. ఈ ఐదురోజులు పలు మసీదులకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేస్తారు.

ఎతికాఫ్ (తపోనిష్ఠ దీక్ష) – ఆధ్యాత్మిక పరిణతి

రంజాన్ చివరి పది రోజుల్లో ఎతికాఫ్ అనే ప్రత్యేక తపోనిష్ఠ దీక్ష ఉంటుంది. ఇల్లు, కుటుంబం, ఉద్యోగ బాధ్యతలన్నింటినీ తాత్కాలికంగా విడిచి పెట్టి బాహ్య ప్రపంచ సంబంధాలు లేకుండా పూర్తిగా మసీదులోనే ఉండాలి. నిమిషం కూడా వృథా చేయక నమాజ్, దువాలోనే సమయం గడపాలి. ఈ పదిదినాలు అల్లాహ్ ధ్యానంలో లీనమై, నిరంతర ఆరాధన చేస్తూ, ఆధ్యాత్మిక చింతనలో నిమగ్నమవుతారు. ఖురాన్ ఉపదేశాల ప్రకారం, ఎవరైనా కనీసం 24 గంటలు ఎతేకాఫ్ పాటిస్తే అల్లాహ్ అతనిపై అపారమైన కరుణ చూపిస్తాడని విశ్వసిస్తారు. ఇతరులతో ఎంతో అవసరమైతేనే మాట్లాడాలి, మసీదు గడపదాటి బయటకు రాకూడదు. మానవుడు తన మనస్సును స్వచ్ఛంగా చేసుకోవడానికి, అల్లాహ్ వద్ద తన పాపాలను క్షమాపణ పొందేందుకు ఇదొక అరుదైన అవకాశం. ఖురాన్ ప్రకారం, ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు(అసం) తన జీవితంలో ఎన్నో రంజాన్ మాసాలను ఎతికాఫ్‌లో గడిపారు. ఇప్పటికే పలు మసీదులు ఎతేకాఫ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాయి. శుక్రవారం నుంచి మసీదుల్లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది.

ఎతేకాఫ్ - మోక్షానికి మార్గం



రంజాన్‌లో ఎతేకాఫ్ ఆచరించడం భక్తులకు ఆధ్యాత్మిక శుద్ధిని అందించే పవిత్ర పథం. అల్లా ఇంటిలో తల వంచి ప్రార్థించే వారిని అతడు అపార కరుణతో ఆశీర్వదిస్తాడు. రంజాన్ నెల చివరి పదిరోజుల్లో ఐదు తాఖ్‌రాత్‌లు వస్తాయి. అన్నీ రాత్రులు అల్లాహ్ ఆరాధన, దువా చేయాలి. ఈ రాత్రులు భక్తి, శాంతి, సామరస్యంతో నిండిపోవాలి. ప్రవక్త ఉపదేశించినట్లుగా, ఒక్క అక్షరం చదివినా పది రెట్లు పుణ్యం లభిస్తుంది. ఈ పవిత్ర రోజుల్లో తహజ్జుద్ (అర్ధరాత్రి ప్రత్యేక నమాజు), ఖురాన్ బోధనలు, సహరీ ముందు ప్రత్యేక దువాలు చేయడం భక్తులకు అనంత దయను తెస్తుంది. శ్రద్ధాభక్తులతో చేసిన ఇబాదత్ 83 ఏళ్ల భక్తి సాధన ఫలితాన్ని అందిస్తుంది.

–మొహమ్మద్ హాఫీజ్ హుస్సేన్, చిలకలూరిపేట

బస్టాండ్‌లో ఎమ్మార్పీ విక్రయాలపై తనిఖీలు



బస్టాండ్‌లోని ఓ షాపును తనిఖీచేస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ అధ్యక్షులు, సభ్యులు

నరసరావుపేట: జిల్లా లీగల్ మెట్రాలజీ ఇనస్పెక్టర్ ఎన్.శివశంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ ఆర్టీసీ బస్టాండులోని కూల్ డ్రింక్ షాపులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో కొందరు వ్యాపారస్తులు కూల్ డ్రింక్ బాటిల్‌పై ఉన్న ధర కన్నా ఎక్కువ ధర వసూలు చేస్తున్నందున కేసులు రాశారు. ఈ సందర్భంగా పిల్లి యజ్ఞనారాయణ మాట్లాడుతూ దయచేసి జిల్లా వ్యాప్తంగా వున్న వ్యాపారస్తులు ఏ వస్తువునూ ఎమ్మార్పీ కన్నా ఎక్కువ అమ్మవద్దని, ఆవిధంగా విక్రయించటం నేరమని, అటువంటి షాపులపై ఆకస్మిక తనిఖీలు చేసి కేసులు రాయడం జరుగుతుందని హెచ్చరించారు. మళ్లీ బస్టాండ్‌లోని వ్యాపారులు ఇదేపని చేసినట్లు ఫిర్యాదులు వస్తే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వారిషాపు సీజ్ చేయించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ దాడులలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు, ఉప కార్యదర్శి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

స్కౌట్ అండ్ గైడ్స్ యూనిఫాం పంపిణీ



స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు

నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్లలో జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్కౌట్ అండ్ గైడ్స్ యూనిఫాం పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో క్రమశిక్షణ విలువలను పెంపొందిచడం కోసం స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. లెఫ్టినెంట్ జనరల్ బడెన్ పావెల్ 1910 సంవత్సరంలో బాలబాట ఉద్యమ స్థాపించారని, విద్యార్థులలో జట్టు, కృషి, సమయ నిర్వహణ, నాయకత్వ లక్షణాలు, చొరవ, ప్రణాళిక స్వీయకరణ సాంస్కృతిక అవగాహన నిబద్ధత కమ్యూనికేషన్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, రాణి, ప్రకాష్ యాదవ్ ఉన్నారు.

ఈ–కేవైసీ లేకుంటే రేషన్ సరుకులు బంద్!

యడ్లపాడు: మండలంలోని కారుచోల గ్రామ ప్రజలు నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థను ఆటంకం లేకుండా కొనసాగించేందుకు ఈ-కేవైసీని ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఇన్‌చార్జీ వీఆర్వోఓ కేపీ చారి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ ఈ-కేవైసీ పూర్తి కాని రేషన్ కార్డు లబ్ధిదారులు తమ సమీప రేషన్‌షాప్ డీలర్ వద్దకు వారి ఆధార్ కార్డుతో వెళ్లి ఈ-కేవైసీని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒకవేళ వేలిముద్రలు పడకపోతే తక్షణమే మీకు సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకోవాలి. ఆ తరువాత, మీ రేషన్ డీలర్ వద్ద ఈ-కేవైసీని పూర్తి చేయించుకోవాలని తెలిపారు.

రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి



మాట్లాడుతున్న మురళి, అమలకుమారి

నరసరావుపేట రూరల్: జిల్లాలోని రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా మార్చేందుకు కృషిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. రావిపాడురోడ్డులోని బృందావనంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సిబ్బంది సమీక్ష సమావేశానికి మురళి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో పనిచేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతి రైతు పీఎండీఎస్ విధానాన్ని పాటించే విధంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఖరీఫ్ ముందు గ్రామాల్లో రైతులకు కావలసిన ఇన్‌పుట్స్ ఘన, ద్రవ, కషాయాలను ముందుగానే ఎన్‌పీఎం షాపుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె. అమలకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 28 మండలాల్లో 132 గ్రామ పంచాయతీల్లో 2002 గ్రామ సమైఖ్య సంఘాలు, 113 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకు 35, 540 మంది రైతులు ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు లక్ష్మీ, మాన్విష, ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిరోధానికి కమిటీలు

ఐసీడీఎస్ సీడీపీవో శాంతకుమారి

నాదెండ్ల: గ్రామ స్థాయిలో బాల్య వివాహాలు, బాలల సంక్షేమం, మిషన్ వాత్సల్యలపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ జి శాంతకుమారి చెప్పారు. మండల పరిధిలోని 89 గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు కానున్నాయన్నారు. గ్రామ కమిటీలకు ఛైర్‌పర్సన్‌గా సర్పంచ్, కన్వీనర్‌గా మహిళా పోలీసు, సభ్యులుగా గ్రామ కార్యదర్శి, వీఆర్వో, హైస్కూలు హెచ్ఎం, గ్రామ సమాఖ్య యానిమేటర్, వార్డు మెంబర్, ఏఎన్ఎం, ఎన్జీవో, ఉమెన్ యాప్ ఆర్గనైజర్, అంగన్‌వాడీ వర్కర్ సభ్యులుగా ఉంటారు. వీరు గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగున్నట్లయితే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. 18 ఏళ్లలోపు బాలలు బడి మానేసి బయట ఉన్నట్లయితే వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించటం, బాలల అక్రమ రవాణా అరికట్టడం, విద్యార్థుల్లో చైతన్యం కల్పించాలన్నారు. కిశోర బాలికలు మంచి ప్రవర్తన కలిగేలా అవగాహన పెంపొందించాలన్నారు. తల్లి, తండ్రి మృతి చెందిన అనాథలైన పిల్లలకు హెచ్ఐవీ సోకిన చిన్నారులకు మిషన్ వాత్సల్య దరఖాస్తులు అందించి వారికి ఆసరాగా నిలవాలన్నారు.

వినుకొండలో విశ్రాంత ఉద్యోగుల అన్నదానం



అన్నదానం చేస్తున్న సంఘం సభ్యులు

వినుకొండ: విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం భవనం ఆవరణలో 83వ అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గంగినేని ఆదిత్య పుట్టినరోజు సందర్భంగా చిన్నారి తాతయ్య గంగినేని వెంకటేశ్వర్లు, జయమ్మ దంపతులు చిన్నారి తల్లిదండ్రులు జి. మునిస్వామి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనగిరి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా విశ్రాంత ఉద్యోగుల సేవా సంఘం సభ్యులు అందిస్తున్నటువంటి సహాయ సహకారాలతో ఇటువంటి కార్యక్రమాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, జి.నాగేంద్రుడు, అవ్వారు కోటేశ్వరరావు, వై.వి.సుబ్బయ్య శర్మ, బి.పి.ఎస్. సుందరరావు, రాఘవయ్య, శేషయ్య, నారాయణరావు, ఎ.రామలింగేశ్వరరావు, కృష్ణమూర్తి , గోపి, ఎం.వి శర్మ, హసన్, దుబ్బల దాసు, శంకరరావు, దీక్షితులు ఆదిరాములు, కె. వెంకటేశ్వర్లు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్య ధోరణితో కార్మికులకు శ్రమదోపిడీ

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయనాయక్



మాట్లాడుతున్న ఆంజనేయ నాయక్

నరసరావుపేట: ప్రభుత్వ విధానాలు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో కార్మికులు శ్రమదోపిడికి గురవుతున్నారని, పరిసరాల శుభ్రతకు పాటుపడుతున్న కార్మికులపట్ల నిర్లక్ష్యవైఖరి తగదని సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయ నాయక్ అన్నారు. జీతాలు చెల్లించాలని అడిగినందుకు మీకు వచ్చేది ఇచ్చేది అంతే.. ఇష్టమైతే రండి కష్టమైతే మానుకోండని మున్సిపల్ కమిషనర్ చెప్పడాన్ని కార్మికులు నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన శుక్రవారం రెండో రోజుకు చేరింది. ఆందోళన శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా ఆంజనేయ నాయక్ మాట్లాడుతూ ఆప్కాస్ ఉన్నప్పటికీ నెల రోజులు పనిచేస్తే 15 రోజులకు వేతనాలు అందులో కూడా కోతలు ఎందుకు విధిస్తున్నారని మండిపడ్డారు. ఆ డబ్బులు ఎవరి జేబుల్లోకి పోతున్నాయో తేల్చాలని దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్, నాయకులు జీవరత్నం, వీరకుమార్, నరసింహారావు, నవీన్, కార్మికులు పాల్గొన్నారు.

యడ్లపాడు జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక రైతు చెన్నుపాటి శ్రీనివాసరావుకు చెందిన జామాయిల్ తోటలో మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి, దీంతో ఒక ఎకరం విస్తీర్ణంలో చెట్లు కాలిబూడిదయ్యాయి. ఘటన తెలుసుకున్న చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నారు. లీడింగ్ ఫైర్‌మెన్ ఆర్. మాణిక్యరావు, ఫైర్‌మెన్ పవన్ కుమార్, డ్రైవర్ ఆపరేటర్ కేఎల్ఎస్. రాజు, హోంగార్డ్ వై. మల్లికార్జునరావు సమయస్ఫూర్తితో చర్యలు తీసుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఈ ఘటనలో సుమారు రూ. 60,000 విలువైన జామాయిల్ చెట్లు దగ్ధమయ్యాయి. అగ్ని ప్రమాదానికి నిర్లక్ష్యంగా పడేసిన సిగరెట్ మాత్రమే కారణమై ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

ఎన్నికల జాబితాపై సమీక్ష

వినుకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల జాబితాపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ఎన్నికల జాబితా స్వచ్ఛీకరణ, పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల ఏర్పాటు, 800 నుంచి 1200 ఓటర్లు కలిగిన పోలింగ్ కేంద్రాలను గుర్తించుట, బూత్ స్థాయి అధికారులకు శిక్షణ తరగతుల ఏర్పాటు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

27న ఆరు గ్రామాల్లో ఉపసర్పంచ్ ఎన్నిక

రొంపిచర్ల : మండలంలో ఆరు గ్రామాలలో ఈ నెల 27న ఉపసర్పంచుల ఎన్నిక జరుగుతుందని ఎండిఓ కె.మ్యాథ్యూబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో కొత్తపల్లి, అన్నవరప్పాడు, తురుమెళ్ళ, వడ్లమూడివారిపాలెం, అలవాల, అచ్చయ్యపాలెం గ్రామాలలో ఉపసర్పంచుల ఎన్నిక జరుగుతుందన్నారు. 27వ తేది ఉదయం 10గంటల నుండి ఉపసర్పంచుల ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, వార్డుమెంబర్లు పాల్గొనాలని కోరారు.

పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన ఎంఈవో

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఈపూరు ఎంఈవో రామతులశి శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో పరీక్షల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు. ఎండాకాలంలో విద్యార్థులకు దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన మంచి నీటి సౌకర్యాన్ని, మెడికల్ క్యాంప్‌ను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. 484 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 478 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6గురు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.